# అందమే ఆనందం



— వారణాసి నాగలక్ష్మి

ప్రియమైన వసంతా!

మనం కలుసుకుని, మనసుదీరా మాట్లాడుకుని ఎన్నాళ్ళైందో కదూ! ఈమధ్య నేనూ; శశీ జీవితంలో యాంత్రికతతో విసిగిపోయి హఠాత్తుగా ఉద్యోగాలకి సెలవుపెట్టేసి, మదుమలైకి వెళ్ళి వారం రోజులుండి వచ్చాము. ఉద్యోగాలు అంటున్నానేమిటా అని ఆశ్చర్యమా? మరి ఇంట్లో నేను చేసే పనులన్నిటికీ కలిపి ఏదో పేరు పెట్టాలి కదా! వంటా, గార్డెనింగ్, ఇంటి పని...వీటన్నింటికీ నేను కూడా సెలవు పెట్టానన్నమాట! ఈ చిన్ని 'బ్రేక్' ఇచ్చిన ఆనందం ఎంతటిదంటే మళ్ళీ కొత్తగా జీవితాన్ని ప్రారంభించినంత ఉత్సాహం కలుగుతోంది. ఇన్నాళ్ళుగా కార్డుముక్కైనా రాయని నేను నీకిలా పెద్ద ఉత్తరం రాయడం చూస్తేనే తెలిసిపోయి వుంటుందిలే నీకు!

వసూ! నిజంగా ఈ ప్రకృతికి మనమెంత ఋణపడి వున్నామో అనిపిస్తుందే. ప్రకృతిలో మనం మాత్రం భాగం కాదా అంటావేమో! నిజమే...అందుకే ఒకరికొకరం కూడా ఋణపడి వున్నామేమో ఏదో ఒక రకంగా. మదుమలై గెస్ట్ హౌస్‌లో వున్న ఆ వారం రోజులూ నేనెప్పటికీ మర్చిపోలేను. ఆ ప్రయాణంలో రోడ్డుకి రెండు పక్కలా పరవళ్ళు తొక్కే సెలయేళ్ళూ, పైనుంచి తెల్లని నురుగులతో కిందికి దూకే జలపాతాలు, కుప్పలు తిప్పలుగా పెరిగిన పూల మొక్కలు, పాము మెలికల్ని గుర్తుచేసే ఘాట్ రోడ్డు మలుపులు, బస్సుని తాకుతూ ప్రయాణించే తెల్ల మబ్బులూ, ఆకాశాన్నంటుతూ ఠీవిగా నిలిచిన యూకలిప్టస్ చెట్లూ, పచ్చని చెట్లతో, అడవి పూలతో నిండిన లోయలూ...మహాద్భుతంగా, మనోహరంగా గడిచిందా ప్రయాణం. దారికి ఒక వైపు వున్న లోయల్ని తెల్లటి మబ్బులు కప్పేసి ఆకాశ యానం చేస్తున్నామేమో అనే భ్రమ కలిగింది. చివరికి గెస్ట్ హౌస్ చేరేసరికి చీకటి పడింది. ఓ అడవి ఏనుగు గెస్ట్ హౌస్ పరిసరాల్లో తిరుగుతోందిట–చీకటి పడ్డాక బయట తిరగద్దని ఆ గెస్ట్ హౌస్ వాళ్ళు చెప్తే ఎంత తమాషాగా అనిపించిందో...మన నిత్య జీవితంలో అలా అడవులూ, అడవి జంతువులూ కనిపించడం అలా వుంచు...ఆ మాటలైనా వినిపిస్తున్నాయంటావా? ప్రకృతిలో మనమూ ఓ భాగమే అనే భావన ఎలా వస్తుందంటావు? నిజంగా అక్కడ గడిపినన్ని రోజులూ ప్రకృతి మాత ఒడిలో వున్నట్టే అనిపించింది. తెల్లవారి లేవగానే మొదట చేసే ముఖ ప్రక్షాళన కూడా దగ్గరలో వున్న సెలయేటికి వెళ్ళేవాళ్ళం. శశి అయితే మరీను. బ్రష్షూ, పేస్టూ రూమ్‌లోనే వదిలి, వేపపుల్లతో పళ్ళు తోముకునేవాడు. ఇంట్లో వున్నపుడూ, ఏ వూరైనా వెళ్ళి హోటల్లో వున్నప్పుడూ సూర్యుడు కూడా కనిపించని ఏ బాత్ రూమ్‌లోనో పూర్తవుతుంది కదా ఈ కార్యక్రమం. గెస్ట్ హౌస్ నుంచి ఆ సెలయేటికి చేరే దారీ, ఆ నడకా ఎంత అపురూపంగా అనిపించాయో! అడవి ఉడుతలూ, ఊడలు వేలాడే వృక్షాలు, గలగలలాడుతూ ఆ ఎండుటాకులూ, రంగు రంగుల పక్షులూ, వాటి కిలకిల రావాలూ...అనుకోకుండా వన్య మృగమేదైనా కనిపిస్తుందేమో అనే కుతూహలం..సహజంగా మితభాషి అయిన శశి కూడా ఎంత 'ఎక్స్‌ప్రెసివ్'గా అయ్యాడో చెప్తే నమ్మలేవు. ఇంక ఆ సెలయేరు గురించి ఏం వర్ణించమంటావు? కొండ రాళ్ళమీదుగా గలగలా ప్రవహించే ఆ స్వచ్ఛమైన నీరు స్వేచ్ఛకి ప్రతిరూపంలా అనిపించింది. చిన్నప్పుడు చదువుకున్న టెన్నిసన్ పద్యం 'ది బ్రూక్', విశ్వనాథవారి కిన్నెరసాని గుర్తొచ్చాయి. అక్కడ నేనో రాయి మీద కూర్చుంటే శశి కొంచెం లోతుగా వున్న చోట 'స్విమ్మింగ్' చేసేవాడు. ఆ వారం రోజుల్లో ఆ రాయీ ఆ చోటూ మా స్వంతమైపోయినట్లనిపించింది.

గెస్ట్ హౌస్ దగ్గర్లో చిన్న హోటల్ వుంది. అక్కడే మా టిఫిన్లూ, భోజనాలూను. కొండ మీదికి చక్కని తారు రోడ్డు వుంది. ఏదో ఒకటి తిని ఆత్మారాముడు సంతృప్తి పడగానే కొండ మీదికి నడుచుకుంటూ వెళ్ళేవాళ్ళం. ఎత్తైన ఆ టేకు చెట్ల మధ్య నడుచుకుంటూ వెళ్తుంటే అలాంటి ఏకాంతం మరెక్కడా దొరకదనిపించింది. మనసు ఎంత చిన్న చిన్న వాటికే ఎంతగా స్పందిస్తుందో అక్కడ అనుభవమైంది. చిన్న పిల్ల తెమ్మెర వీచినా, ఏ అడవి తీగకో

పూసిన పూలు చూసినా చాలు-వర్ణించలేని ఆనందం! ఆ దారిలో ఓ అడవి జాజి తీగ పెద్ద గుబురులా పెరిగింది. దాని పూలు రోజూ పైకెళ్ళేటప్పుడు కోసి పట్టుకెళ్ళేదాన్ని. శశి కూడా సాయం చేసేవాడు. ఆశ్చర్యపోతున్నావు కదూ! అదంతా ఆ పరిసరాల మహిమ! కొండ మీద కూర్చుని అవన్నీ మాల కట్టుకునే దాన్ని. దారిలో అక్కడక్కడ రేగు చెట్లూ, ఉసిరి చెట్లూకూడా వున్నాయి. వాటి కాయలు కోసుకుని తినడంలో ఎంత మజా అనుకున్నావు! బజారులో పది మూరల మల్లెలు కొనుక్కుని పెట్టుకుంటేనూ, యాపిల్సే ద్రాక్షలో కొనుక్కుని తింటేనూ ఆ అనుభూతి వస్తుందనుకున్నావా!


ఒకసారైతే ఆ దారి పక్కనున్న లోయలో ఓ అడవి ఏనుగు కన్పించింది. స్వేచ్ఛగా సంచరిస్తూ, నెత్తిమీద మట్టి పోసుకుంటూ, ఆ ఏనుగు చెట్ల మధ్య కన్పిస్తూ మాయమౌతూ వుంటే మేమిద్దరం రెప్ప వేయడం మరిచి చూస్తుండి పోయాం. ఆ లోయ కవతలివైపు కొండల వరుసలు...వాటిని కప్పేస్తూ వెండి మబ్బులూ...మంచు తెరలూనూ...మబ్బులు కరిగినట్టుగా విడిపోయి కొండల వరుసలు కన్పించడం...అంతలోనే మరో మబ్బు తెర వాటిని కప్పేయడం... ప్రకృతి ఆడుకునే దాగుడుమూతలాటలా అన్పించింది. రోజూ చూసినా ఏరోజూ ఒక్కలా వుండని ఆ సూర్యాస్తమయాలూ, సూర్యోదయాలూ, ఆకాశపు అందాలూ వర్ణించడానికి నేను కవయిత్రిని కాకపోతినే అన్పిస్తోంది. ఆ సిలపు కొండలూ, మంచు తెరలూ, వజ్రపు మెరుపుల్లా తళతళలాడే, మంచు తెరల్లోంచి తొంగి చూసే సూర్య కిరణాలూ, బంగారు పొడి చల్లినట్టుగా మెరిసే మబ్బుల అంచులూ అలా ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ మేమిద్దరం ఏం మాట్లాడుకున్నామో మాకే గుర్తులేదు. సౌందర్యమనే మద్యం తాగిన వాళ్ళలా ఆ మత్తులో ఏం చేశామో మాకే తెలీదు. యాంత్రికతతో అలసిపోయిన మా మనసులపై ఆ వారం రోజులూ ఎంత ప్రభావం చూపాయంటే చిన్న చిన్న చిరాకులూ, మనస్పర్థలు దూరమై 'అందమె ఆనందం...ఆనందమె జీవిత మకరందం' అన్నట్టుగా జీవన మకరందాన్ని పీల్చిన తుమ్మెదల్లా అయ్యాం తిరిగి వచ్చేసరికి. స్వప్న లోకంలో విహరించి వచ్చినట్టన్పించిందంటే నమ్ము. ఇలా ప్రసన్నంగా వున్న ప్రకృతే కోపగించిందంటే ఆ బీభత్సాన్ని మాత్రం వర్ణించగలమా? పిల్ల తెమ్మెరలకు పరవశిస్తాం గాని, ఈదురుగాలికి ఆనందించగలమా? గాలికి పూదీవెలు వూగిసలాడితే, పూలు పరిమళాల్ని విరజిమ్మితే మురిసిపోతాంగాని మహా వృక్షాలు కుప్పగూలేలా గాలి వీస్తే భయభ్రాంతులం కామూ? మబ్బుల అంచులు మెరుపుల్లా కన్పిస్తే కలిగే ఆనందం నిజంగా మెరుపులు మెరిస్తే కలుగుతుందా? జీవితం యాంత్రికమైందంటే విసుగేకాని, ఆ క్రమబద్ధత పూర్తిగా లోపిస్తే ప్రశాంతత ఎక్కడుంటుంది? తిరిగి తిరిగి ఇల్లు చేరేసరికి మాడు ఎంత హాయిగా వుంటుందో? అందుకే అన్నారేమో 'గృహమే కదా స్వర్గసీమ' అని! అలా ఆ స్వప్నసీమ నుంచి మా స్వర్గసీమకు చేరామన్నమాట. తిరిగి వస్తూ-చీరలూ, నగలూ, వస్తువులూ కొనుక్కునేకంటే అలా ఆదా చేసిన డబ్బుతో అపుడపుడు ఇలా ఎక్కడికైనా వెళ్ళాలని నిర్ణయించుకున్నాం. ఎంత స్వర్గ సౌభాగ్యాలనుభవిస్తున్నా స్వప్నానుభూతుల కోసమైనా ఇలాంటి ఔటింగ్స్ వుండాలే వనూ! అది అనుభవిస్తేనే తెలిసే ఆనందం.

ఇక వుంటానూ...

ప్రేమతో
నళిని

# భూతదయ





నాకు చిలకంటే ఎంతో ఇష్టం
అంద చందాల చిలక
చిలుక పలుకుల చిలక
చెప్పిందల్లా ఒప్పజెప్పే చిలక
రామరామ అని నేర్పితే
ప్రేమతో ముద్దు ముద్దుగా
పల్కించే రామచిలక

పావురాల జంటనైనా
లేడిపిల్లనయినా
వేటాడగలడేమో కాని
ఈ చిన్న ప్రాణాన్ని చంపడానికి
కిరాతకునికైనా చేతులు రావు

కాని ఏం చేసేది
మాయల ఫకీరు ప్రాణం
చిలకలో వుందట!

—వరవరరావు



ఉత్కంఠభరితపు యండమూరి
తాజా సీరియల్
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక
పాఠకుల కోసం తయారవుతోంది!